www.udayageethika.com

# ఉదయ గీతిక

UDAYA GEETHIKA సమగ్ర జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/TEL/3205-98321

ఆదివారం 13,సెప్టెంబర్ 2026 | సంచిక : 6 సంపుటి : 4 | పేజీలు: 4 | వెల : రూ. 4/-

ఉదయ గీతిక

UDAYA GEETHIKA సమగ్ర జాతీయ తెలుగు దినపత్రిక

ఉదయ గీతిక తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాలలో రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలవారు క్రింది ఈమెయిల్ ద్వారా సంప్రదించగలరు.

udayageethika@gmail.com

# రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత ఇవ్వాలి

**- పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జి దుర్మార్గం**

**-అధికారికంగా విమోచన దినోత్సవం జరిపే వరకూ పోరాడతాం: రాంచందర్‌రావు**

*హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఉదయగీతిక):* ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ విషయమై బీఆర్ఎస్ సర్కారును బీజేపీ ఎందుకు ప్రశ్నించలేదని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన అవాస్తవమన్నారు. 2017 జనవరి నాలుగో తేదీన ఎమ్మెల్సీగా తాను ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్పు, విద్యావ్యవస్థ దుస్థితిపై గళమెత్తిన అంశం మండలి రికార్డుల్లో ఉన్నదని గుర్తు చేశారు. బకాయిలు చెల్లించనందువల్లే పలు కాలేజీలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవో 97 ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌ను ఇంటిగ్రేట్ చేసి.. పూర్తిగా పాలిటెక్నిక్ కోర్సులను ఎత్తేయడానికి కుట్ర చేస్తోందన్నారు. ఢిల్లీలో 'చాత్రోంకీ గూంజ్ అని రాహుల్ గాంధీ ఉపన్యాసాలిస్తుంటే.. తెలంగాణలో మాత్రం లాఠీలతో విద్యార్థులను చితక బాదుతున్నారని మండి పడ్డారు. సమస్యల పరిష్కారానికి బీజేపీ కార్యకర్తలు కాలేజీలకెళ్లి సేకరించిన సుమారు 8 లక్షల మంది విద్యార్థుల సంతకాలతో కూడిన వినతి పత్రాలను సమర్పించడానికి సీఎం కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని రాంచందర్‌రావు ఆరోపించారు. మరోవైపు, రిటైర్డు డీసీపీ శ్రీనివాసరావు, సూర్యాపేట జిల్లాలోని ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు, యువకులు బీజేపీలో చేరారు. వారికి రాంచందర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి



2లో



## సురేఖకు అధిష్ఠానం పిలుపు!

*హనుమకొండ/ హనుమకొండటౌన్, సెప్టెంబరు 12 (ఉదయగీతిక):* మాజీ మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఇటీవలే మంత్రిపదవి నుంచి బర్తరఫ్ అయిన సురేఖకు క్యాబినెట్ స్థాయి పదవి ఇచ్చే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. ఇటీవల కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కొండా సురేఖ మాట్లాడారని, బర్తరఫ్ తర్వాతి పరిణామాలపై వారు చర్చించారని తెలిసింది. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలని, పార్టీలో క్రియాశీలకంగా ఉండాలని సురేఖకు మీనాక్షి సూచించారని సమాచారం.ఈ క్రమంలోనే ఢిల్లీకి రావాలంటూ అధిష్ఠానం నుంచి సురేఖకు కబురు అందింది. ఈ అంశంపై చర్చించడానికి కొండా సురేఖ ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. తప్పనిసరిగా రావాలని కొండా మురళి ముఖ్య కార్యకర్తలందరికీ ఫోన్ చేసి చెప్పినట్టు తెలిసింది. కార్యకర్తలతో భేటీ అనంతరం ఢిల్లీ పెద్దలతో సురేఖ మాట్లాడనున్నారని, ఆదివారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. కాగా, తన మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి నార్ల సుబ్రహ్మణ్యంను కొండా సురేఖ పరామర్శించారు. తన కుమారుడిపై కేసుల వ్యవహారంతో ఆందోళన చెందిన సుబ్రమణ్యం శుక్రవారం ఆత్మహత్యయత్నం చేశారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఆస్పత్రికి వెళ్లిన కొండా సురేఖ.. సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సుమంత్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు.



రెండో రోజుకు 'బ్రిక్స్'..ప్రపంచ నేతలకు

## స్వాగతం పలికిన మోదీ.!

*న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఉదయగీతిక):* ప్రపంచ వేదికపై అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరాన్ని మరింత బలంగా వినిపించే దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. ఢిల్లీలో భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజుకు చేరుకుంది. ఈ సమావేశాలు నేటి(ఆదివారం)తో ముగియనున్నాయి. తుది సమావేశంలో పలువురు ప్రపంచ నేతలు పాల్గొని.. సమ్మిళిత ప్రపంచ వృద్ధి, స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం వంటి అంశాలపై చర్చించనున్నారు. 'బలమైన స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత నిర్మాణం' అనే ఇతివృత్తంతో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టింది భారత్. ఈ తుది భేటీకి 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత: సమ్మిళిత ప్రపంచ వృద్ధి కోసం భవిష్యత్తును తీర్చిదిద్దడం' అనే శీర్షికను నిర్ణయించారు.

**నేతలకు ప్రధాని మోదీ స్వాగతం**

దేశ రాజధానిలో భారత్ మండపం వేదికగా జరుగుతున్న ఈ సదస్సుకు హాజరవుతున్న ప్రపంచ నేతలకు ప్రధాని నరేంద్ర మోదీ ఘన స్వాగతం పలికారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, సౌదీ విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్‌సౌద్, వియత్నాం పీఎం లే మిన్ హంగ్, బురుండి అధ్యక్షుడు ఎవారిస్ట్ న్దాయిషిమియే, కజకిస్థాన్ ప్రెసిడెంట్ కస్సీమ్ జోమార్ట్ టొకాయేవ్, ఉగాండా ఉపాధ్యక్షురాలు జెసికా అలుపో తదితరులను మోదీ ఆత్మీయంగా ఆహ్వానించారు. కాగా.. అంతకుముందు శనివారం జరిగిన సమావేశాల్లో పలు అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ.. చివరకు బ్రిక్స్ దేశాలు ఏకాభిప్రాయంతో సంయుక్త ప్రకటనను ఆమోదించాయి. ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభంపై సభ్య దేశాల మధ్య ఉన్న విభేదాలను అధిగమించడం సదస్సులో కీలక పరిణామంగా నిలిచింది. అమెరికా ఇరాన్‌పై చేసిన దాడులపై ప్రత్యక్షంగా ప్రస్తావించకుండానే ఢిల్లీ ప్రకటనను రూపొందించడం గమనార్హం. అదే సమయంలో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు 'చర్చలు, దౌత్యం' ద్వారానే పరిష్కారం కనుగొనాలని బ్రిక్స్ నేతలు పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది.రెండో రోజు సమావేశాలతో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగియనుండగా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక రాజకీయ పరిణామాలు, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఢిల్లీ నుంచి వెలువడే సందేశంపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## 7,500 కోట్ల అప్పు తీసుకోనున్న తెలంగాణ

*హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఉదయగీతిక):* రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 కోట్ల అప్పు తీసుకోనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల 16న నిర్వహించే ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించనుంది. 7.53 శాతం వార్షిక వడ్డీ, 13ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు., 7.64 శాతం వార్షిక వడ్డీ, 18 ఏళ్ల కాల పరిమితితో రూ.2000 కోట్లు., 7.65 శాతం వార్షిక వడ్డీ, 23 ఏళ్ల కాల పరిమితితో రూ.2000 కోట్లు., 7.65 శాతం వార్షిక వడ్డీ, 29 ఏళ్ల కాల పరిమితితో రూ.2000 కోట్ల చొప్పున మొత్తం రూ.7,500 కోట్ల రుణాన్ని తీసుకోనుంది.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సత్వర చర్యలు

*న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఉదయగీతిక):* ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయం అంశంపై శనివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశ వివరాలను కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రాజెక్టును వేగవంతంగా,పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖల నుంచి, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు నోడల్ ఆఫీసర్లను వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. అలాగే, విమానాశ్రయాన్ని రక్షణ, పౌర విమాన కార్యకలాపాల కోసం ఉమ్మడిగా వినియోగించుకునేలా డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలనీ నిర్ణయించినట్లు చెప్పారు. కాగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మద్దతు, మార్గదర్శకత్వంతో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.



## నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

*హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఉదయగీతిక):* బంగళాఖాతంలో అల్పపీడనం వల్ల రాష్ట్రంలో ఆదివారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఆ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాల్లోనూ అక్కడక్కడా తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం కూడా రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం.. ఆ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసిందికాగా, గత 24 గంటల్లో కుమరంభీం-ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ, ఖమ్మం జిల్లా కారేపల్లిలో అత్యధికంగా 6.5 సెం.మీ, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బూర్గం పహడ్‌లో 6.45 సెం.మీ, మంచిర్యాల జిల్లా భీమిని, జయశంకర్-భూపాలపల్లి జిల్లా పలిమెలలో 4.8, అదే జిల్లా ముత్తారంలో 4.3 సెం.మీ వర్షపాతం రికార్డైందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వర్షంతో ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టులోకి 2,172 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నుంచి దిగువకు 1378 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు.

## 800 ఏళ్లనాటి బాల గణపతి శిల్పం

*హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు12 (ఉదయగీతిక):* గౌరీ నందనుడు వినాయకుడి అరుదైన శిల్పం ఆదిలాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. తల్లి పార్వతీదేవి ఒడిలో కూర్చొని చనుబాలు తాగుతున్న 800 ఏళ్లనాటి బాల గణేశుడి అరుదైన ప్రతిమను ఆదిలాబాద్‌కు సమీపంలోని చందా, శివారం గ్రామాల మధ్య రైలు కట్ట పక్కనున్న ఓ చెట్టుకింద స్థానిక ఉపాధ్యాయుడు పృథ్వీరాజ్ రొడ్డావార్ గుర్తించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు ఆ విగ్రహాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి పరిశీలించారు.

## కొత్త 'పింఛన్ల' పంపిణీకి సర్వం సిద్ధం



*మంచిర్యాల, సెప్టెంబరు 11 (ఉదయగీతిక):* రాష్ట్రంలో కొత్త పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. ముఖ్యంగా 'చేయూత' పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హులను ఏరివేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సర్వే పూర్తికాగా, కొత్తగా దరఖాస్తు చేసేందుకు ఈ నెల 15తో తుది గడువు ముగియనుంది. అనంతరం అర్హతగల లబ్ధిదారులకు పింఛన్ మంజూరు చేయడమే మిగిలి ఉంది. లబ్ధిదారుల్లో మృతిచెందిన వారిని గుర్తించి, వారి పింఛన్లు రద్దు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టారు. గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, నగర పాలక సంస్థ, పురపాలక సంఘాల కమిషనర్లు సంయుక్తగా పింఛన్ల జాబితాలో మృతుల వివరాలు అందజేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు లబ్ధిదారుల సర్వే నిర్వహించి పూర్తివివరాలు సేకరించారు. పదేళ్లుగా అందుతున్న పింఛన్లలో చాలా మంది వృద్ధులు, ఇతర లబ్ధిదారులు మృతి చెందినప్పటికీ వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ఇంకా సొమ్ము జమ అవుతూనే ఉందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. మృతుల ఏరివేతతో పింఛన్ల రూపంలో ప్రభుత్వ ఖజానాపై పడుతున్న అనవసర భారం తగ్గడంతోపాటు నిజమైన పేదలు, అవసరమున్న వారికి లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయి, విచారణ అనంతరం అర్హులకు కొత్త పింఛన్లు జారీ చేయనున్నారు.

**జిల్లాలో 92,159 మంది లబ్ధిదారులు....**

వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారిలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 92,159 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో మునిసిపాలిటీలకు చెందిన 22,641 మంది లబ్ధిదారులు ఉండగా, వీరికి బ్యాంకు ఖాతాల్లో నగదు పింఛన్ డబ్బులు జమ అవుతుండగా 70,018 మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కాగా, వారందరికీ పోస్టాఫీసుల ద్వారా నెలవారీ పింఛన్లు అందుతున్నాయి. గతప్రభుత్వ హయాం నుంచి ఈ విధంగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతూనే ఉంది. ఈ క్రమంలో చనిపోయిన వారికి కూడా పింఛన్ సొమ్ము జమ అవుతుందనే ప్రచారం మేరకు ప్రభుత్వం సర్వేకు పూనుకుంది. సర్వేలో భాగంగా అధికారుల విచారణలో మంచిర్యాల కార్పొరేషన్‌తోపాటు మందమర్రి, బెల్లంపల్లి మునిసిపాలిటీలకు సంబంధించి గత పదేళ్ల కాలంలో ఇప్పటి వరకు 1600 పైచిలుకు లబ్ధిదారులు మృతి చెందినట్లు తేలింది. అలాగే పోస్టాఫీసు ద్వారా పింఛన్లు పొందుతున్న వారిని ప్రత్యేకంగా రూపొందించిన 'యాప్' ద్వారా ముఖ గుర్తింపు చేపడుతున్నారు.

**జిల్లాలో 11వేల పైచిలుకు దరఖాస్తులు..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వివిధ పథకాల అమలు కోసం ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు స్వీకరించింది. అంతా సవ్యంగా సాగితే 2024 ఆగస్టు ఒకటవ తేదీ నుంచే కొత్త పింఛన్లు అందజేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ, అనూహ్యంగా మృతి చెందిన లబ్ధిదారుల అంశం తెరపైకి రావడం, జాబితాను ప్రక్షాళన చేయాల్సి రావడంతో కొత్త దరఖాస్తుల పరిశీలనకు ఆటంకం ఏర్పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'చేయూత' పథకం కింద కొత్తగా దరఖా స్తులు ఆహ్వానించింది. చేయూత పథకం కోసం ఈనెల 15వ తేదీతో ప్రక్రి య ముగియనుండగా, ఇప్పటివరకు 11,200 పైచిలుకు మంది అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. గడువు ముగిసే సమయం వరకు వచ్చే దరఖాస్తులతోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగులో ఉన్న పింఛన్ లిస్టు కూడా పరిగణలోనికి తీసుకోవడం ద్వారా అర్హుల జాబితా తయారు చేయనున్నట్లు సమాచారం. దరఖాస్తు ప్రక్రియ పూర్తికాగానే ఈనెల 25వ తేదీ వరకు విచారణ జరిపి, తుది అర్హుల జాబితాను ప్రభుత్వా నికి అందజేయ నున్నారు. దాని ఆధారంగా అర్హులైన దరఖాస్తుదారులకు చేయూత పింఛన్లు అందనున్నాయి. పథకంలో భాగంగా చేనేత, పైలేరియా రోగులు, వితంతువు లు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులకు పింఛన్లు అందజేయ నున్నారు. ప్రస్తుతం ఆసరా పథకం కింద 2016 రూపాయలు, దివ్యాంగులకు 3016 రూపాయలు ఇస్తున్నారు. చేయూత పథకం ద్వారా నాలుగు వేల రూపాయలు అందించనున్నట్లు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని అర్హులకు పింఛన్లు అందజేసేందుకు నెలకు దాదాపు రూ. 3 కోట్ల 95 లక్షల 46 వేలు అవసరం కాగా, ఇతర విభాగాల వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు నెలకు రూ. 20 కోట్ల 18లక్షల 68 వేల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.



## పశ్చిమాసియాలో శాంతి మన బాధ్యత

*న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:* ప్రపంచాన్ని సంక్షోభంలో పడేసిన పశ్చిమాసియా ఘర్షణలను నివారించేందుకు బ్రిక్స్ కూటమి కృషిచేయాలని చైనా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతను నెలకొల్పే బాధ్యతను బ్రిక్స్ దేశాలు స్వీకరించాలని సూచించారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో సుదీర్ఘంగా కొనసాగుతున్న సాయుధ ఘర్షణలు అక్కడి ప్రజలతోపాటు ప్రపంచం మొత్తాన్ని ఇబ్బందుల్లో పడేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ

## వర్క్‌షాప్ ప్రారంభం..

*హైదరాబాద్, సెప్టెంబరు 12::* డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (౧×మీ)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకోనున్నారు.వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.